క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నడకుదురులో గోమాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కన్నబాబు

కరప: మండలంలో సోమవారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఇటీవల మరణించిన వారి కుటుంబాలను పరామర్శించారు. నడకుదురులో వైఎస్సార్ సీపీ నాయకులు గోమాడ ఏసుబాబు తండ్రి గోమాడ అప్పారావు మృతిచెందగా, కన్నబాబు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గురజనాపల్లి శివారు అడవిపూడిలో పార్టీ కార్యకర్త పెంకే శ్రీను మరణించగా, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సర్పంచ్‌లు అనసూరి శ్రీనివాసరావు, వెలుగుబంటి సీతారామరాఘవ, నాయకులు పైలా గోవిందు, యెడ్ల కృష్ణార్జున ఉన్నారు.

కొనసాగిన కమిషనింగ్ ప్రక్రియ



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అబ్జర్వర్ ఎస్.గణేష్. చిత్రంలో ఆర్వో వెంకటరావు

కాకినాడ: ఈవీఎంల్లో బ్యాలెట్, అభ్యర్థుల గుర్తులను నిక్షిప్తం చేసే కమిషనింగ్ ప్రక్రియ రెండో రోజైన సోమవారం కూడా కొనసాగింది. కాకినాడ పార్లమెంట్‌కు సంబంధించి స్థానిక మెక్లారిన్ స్కూల్ ఆవరణలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. పోటీ చేసే అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో కమిషనింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.గణేష్ కమిషనింగ్ ప్రక్రియను పరిశీలించారు. సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ప్రక్రియ జరుగుతున్న విధానాన్ని, చేసిన ఏర్పాట్లను అబ్జర్వర్‌కు వివరించారు.

రవికుమార్ స్మారక క్రికెట్ టోర్నీ విజేత తూర్పు



టోర్నీ విజేత తూర్పు జట్టుతో సంఘ ప్రతినిధులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఎంసీ క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంఎస్ రవికుమార్ స్మారక క్రికెట్ టోర్నీ విజేతగా తూర్పుగోదావరి జట్టు, రన్నర్స్‌గా ఫ్రెండ్స్ క్లబ్ జట్టు నిలిచాయి. క్రికెట్ సంఘ కార్యదర్శి సత్యనారాయణ సోమవారం వివరాలు తెలిపారు. ఫైనల్స్‌లో తూర్పు జట్టు 48 ఓవర్లలో 214 పరుగులు చేయగా, ఫ్రెండ్స్ జట్టు 41 ఓవర్లలో 104 పరుగులకే కుప్పకూలింది. విజేతలకు సంఘ అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్, కార్యదర్శి సత్యనారాయణ, కోచ్ ఇజ్రాయిల్ రాజు బహుమతులు అందజేశారు.

ఐక్యూఏసీ కార్యకలాపాలపై సమీక్ష

బాలాజీచెరువు: ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ డైరెక్టరేట్‌కు సంబంధించిన కార్యకలాపాలపై జేఎన్‌టీయూకే వీసీ హాల్లో సోమవారం వీసీ ప్రసాదరాజు సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పార్ట్‌టైం పీహెచ్‌డీ చేయడానికి అవకాశాలు విశదీకరించారు. సెమినార్లు, వర్క్‌షాపులు, స్టూడెంట్స్ ప్రోగ్రాంపై గత మూడేళ్లకు సంబంధించి పరిశోధన పత్రాలు, ఆవిష్కరణలపై చర్చించారు. అమెజాన్ సంస్థ విద్యార్థులకు రూ.రెండు లక్షల స్కాలర్‌షిప్, ల్యాప్‌టాప్ వంటి సౌకర్యాలు కలిగించడంపై ప్లేస్‌మెంట్ అధికారులను అభినందించారు. రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, ఐఎస్‌టీ డైరెక్టర్ గోపాలకృష్ణ, ఐఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ బాదం బాలకృష్ణ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లో 815 ఓట్లు

కాకినాడ: పోస్టల్ బ్యాలెట్ ద్వారా సోమవారం 815 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెలిసిటేషన్ సెంటర్‌లో మూడో రోజు 815 మంది ఓటు వేశారు. తొలిరోజు 642 మంది, రెండో రోజు 819, మూడో రోజు 815 మంది ఓటు వేశారు. మూడు రోజుల్లో 2,276 మంది ఓట్లు వేశారు.

ఫారం–12/12డి సమర్పించకపోయినా..

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గంలో ఓటరుగా నమోదై పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం–12/12డి సమర్పించని ఎన్నికల సిబ్బంది కూడా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవచ్చని ఆర్‌ఓ జె.వెంకటరావు తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో స్థానిక శారదాదేవి ఆలయం సమీపంలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఈ సదుపాయం ఉందన్నారు.

నేడు, రేపు పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం

కాకినాడ రూరల్: నియోజకవర్గ పరిధిలో పోస్టల్ బ్యాలెట్‌కు మరో రెండు రోజులు అవకాశం ఉందని ఆర్‌ఓ ఇట్ల కిషోర్ తెలిపారు. సర్పవరం జంక్షన్ వద్ద ఆర్వో కార్యాలయంలో ఫారం–12తో మంగళ, బుధవారాల్లో ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు.

కష్ట మే.!

- కొద్ది రోజులుగా ఠారెత్తిస్తున్న ఎండలు
- నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు
- బెంబేలెత్తుతున్న వృద్ధులు, చిన్నారులు



నిర్మానుష్యంగా మారిన కాకినాడ జగన్నాథపురం అన్నమ్మఘాటీ సెంటర్

కాకినాడ సిటీ: ఎండలు మండిపోతున్నాయి. గత కొద్ది రోజులుగా సూర్యుడు ప్రతాపం చూపుతున్నాడు. రోజూ 40 డిగ్రీల సెల్సియస్ దాటుతుండడంతో జనం ఠారెత్తిపోతున్నారు. మధ్యాహ్నం వేళ బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. మూడు రోజులుగా 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో వారం రోజుల సైతం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

జంకుతున్న జనం

మండుతున్న ఎండలకు బయట అడుగు పెట్టాలంటేనే కాకినాడ వాసులు జంకుతున్నారు. ఉదయం 8–9 గంటల నుంచే ఎండ సుర్రుమంటోంది. ఉదయం పది దాటిందంటే ఇక సాయంత్రం ఆరు దాకా మండుతూనే ఉంది. ఎండలో ఏ మాత్రం తిరిగినా, డీ హైడ్రేషన్ తప్పడం లేదు. సకాలంలో సరిపడా నీళ్లు తాగకపోతే వడదెబ్బ బారిన పడాల్సి వస్తోంది. ఇంట్లో ఫ్యాన్లు, కూలర్లు పెట్టుకున్నా వేడిని తాళలేకపోతున్నారు. ఫ్యాన్‌గాలి కూడా వేడిగా వస్తుండటంతో ఆపసోపాలు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు మరింత అవస్థలు పడుతున్నారు.

రోడ్లు నిర్మానుష్యం

ఉదయం పది దాటితే చాలు ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పని ఉన్న వారు మాత్రమే బయటకు వస్తున్నారు. చిరు వ్యాపారులు, వైద్య సేవలు అవసరం ఉన్న వారే రోడ్లపై కనిపిస్తున్నారు. ఎండ తీవ్రతతో చల్లటి పానీయాలు, చెరుకురసం తాగేందుకు ప్రాధాన్యమిస్తున్నారు.

ద్రవ పదార్థాలు తీసుకోవాలి

ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. మంచినీరు, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ లాంటివి తీసుకోవడం శ్రేయస్కరం. కనీసం రోజుకు ఆరు లీటర్ల నీరు తాగాలి. రోడ్లపై కనిపించే చల్లటి రంగు పానీయాలు, మద్యం తీసుకోకపోవడమే మంచిది.

నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	ఉష్ణోగ్రత
మే 1	41.9
మే 2	42.6
మే 3	42.8
మే 4	42.2
మే 6	40.4

వడదెబ్బకు గురైతే..

వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి. గాలి బాగా తగిలేలా చూడాలి. కొబ్బరినీరు, గ్లూకోజ్, మజ్జిగ, ఓఆర్ఎస్ తాగించాలి. దుస్తులను వదులుగా చేసి, తడిగుడ్డతో ఒళ్లంతా తుడవాలి. కీరదోస ముక్కలు తినిపించాలి. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే.. వెంటనే వైద్యులను సంప్రదించాలి.

ఎంతమంది కలిసొచ్చినా వైఎస్సార్ సీపీదే విజయం

పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు

కాకినాడ రూరల్: కూటమిగా ఎంతమంది కలిసి వచ్చినా వైఎస్సార్ సీపీదే విజయమని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారని పార్టీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సర్పవరం గ్రామంలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలందరూ ఐదేళ్ల పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు పేదలపాలిట వరంగా మారాయని, వారి ఆర్థిక పరిస్థితి మెరుగైందన్నారు. ఇచ్చిన మాటను తప్పకుండా నవరత్న సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. అదే క్రమంలో సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోను వాస్తవికతకు అద్దం పట్టేలా ప్రకటించారన్నారు. చెప్పింది చేస్తాడనే నమ్మకం జగన్‌పై ఉందని, ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. జిల్లాలో పార్లమెంట్ స్థానంతో పాటు, ఏడు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోబోతున్నట్టు ప్రకటించారు. సమావేశంలో పార్టీ నాయకుడు పుల్ల చందు, కోటేశ్వరరావు, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, ఎంపీటీసీ రాజేష్ పాల్గొన్నారు.

దుమ్ములపేటలో టీడీపీకి షాక్

వైఎస్సార్ సీపీలో చేరిన మత్స్యకారులు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: కాకినాడ దుమ్ములపేట ప్రాంతానికి చెందిన సుమారు 200 మంది మత్స్యకారులు టీడీపీ, జనసేన పార్టీలకు గుడ్‌బై చెప్పి, వైఎస్సార్ సీపీలో చేరారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ ఆధ్వర్యంలో దుమ్ములపేట జ్యోతులవారివీధి, మున్సిపల్ స్కూల్ వీధి ప్రాంతాలకు చెందిన వీరంతా టీడీపీని వీడి, సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పేర్ల ప్రసాద్, పేర్ల అమ్మోరు, సూరాడ చంద్రయ్య, సీకోటి రాజు, సూరాడ సత్తిరాజుతో పాటు, పెద్ద ఎత్తున మహిళలు, యువత ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ఎన్నికల్లో మత్స్యకారులంతా వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు సహకరించాలని కోరారు. మత్స్యకారులకు అన్నివిధాలా అండగా ఉంటామని చెప్పారు.

మత్స్యకారులకు కొండబాబు దగా

- దత్తత తీసుకున్నా.. చేసిన అభివృద్ధి శూన్యం
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ద్వారంపూడి ఆగ్రహం



ఎన్నికల ప్రచారంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: అధికంగా మత్స్యకారులు నివసించే దుమ్ములపేట ప్రాంతాన్ని దత్తత తీసుకుని, ఎన్నికల్లో గెలిచాక పూర్తిగా నిర్లక్ష్యం చేసిన ఘనత టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకే దక్కిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన పదో డివిజన్ దుమ్ములపేట పావురాలతూము ప్రాంతంలోని సత్యనగర్‌లో పర్యటించారు. ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ అధికారంలో ఉన్నంతసేపు రాజకీయ స్వార్థం, ఆస్తులను కూడబెట్టుకోవడం మినహా సొంత సామాజికవర్గమైన మత్స్యకారులకూ కొండబాబు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. తాను అధికారంలోకి వచ్చాక 2019 నుంచి ఇప్పటి వరకు రూ.11 కోట్ల ఖర్చుతో దుమ్ములపేట ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చేసి పీహెచ్‌సీని కూడా అందుబాటులోకి తెచ్చానన్నారు. ప్రభుత్వ పరంగా మత్స్యకార భరోసాతో పాటు, మరెన్నో సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. చేసిన అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట మత్స్యకార నాయకులు వాసుపల్లి కృష్ణ, వాసుపల్లి రాంబాబు, ఎరుపల్లి సీతారామ్, పేర్ల దుర్గారావు, వాసుపల్లి అప్పారావు, తిరిది సత్యం తదితరులు ఉన్నారు.

శేషబ్‌గల్లీలో ప్రచారం

34వ డివిజన్ సూపర్‌బజార్ వెనుక శేషబ్‌గల్లీ ప్రాంతంలో ఎమ్మెల్యే ద్వారంపూడి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ ప్రాంత ప్రజలను కలిసి గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని వివరించారు. తనను మరోసారి ఆశీర్వదిస్తే ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి, ఎటువంటి సమస్య ఉన్నా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ తెహరా ఖాతూన్, మైనార్టీసెల్ అధ్యక్షుడు ఖాలీద్‌బిన్ వలీ, సీనియర్ న్యాయవాది ఎస్.ఇజాజుద్దీన్, నాయకులు అజ్జు, మొయిన్, నవాబ్ తదితరులు ఉన్నారు.

భార్య మహాలక్ష్మి ప్రచారం

సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి భార్య మహాలక్ష్మి 44వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ బాలికల పాఠశాల, వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి భర్త ద్వారంపూడి చేసిన అభివృద్ధిని చూసి మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. ఆమె వెంట మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత, పలువురు స్థానిక నాయకులు ఉన్నారు.

కుమార్తెల ప్రచారం

సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కుమార్తెలు డాక్టర్ ప్రణీత, డాక్టర్ అంజని విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డాక్టర్ ప్రణీత 35వ డివిజన్‌లోని మున్సిబ్‌వీధి, దంటువారివీధి, దూసర్లపూడివారివీధి, నూకాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఆమె వెంట స్థానిక నేతలు బెండా విష్ణు, గోవిందు, హరి, ఏడుకొండలు, శ్రీను, కుమార్‌రెడ్డి, రమేష్ తదితరులున్నారు. మరో కుమార్తె డాక్టర్ అంజని, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి సతీమణి మాధురి జగన్నాథపురం 24వ డివిజన్ పద్మనాభనగర్, గణేష్‌నగర్, బాపూజీ నగర్ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. 2019 నుంచి ఐదేళ్ల పాటు కాకినాడ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేసి, కుల, మత రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ద్వారంపూడిని మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భర్త ద్వారంపూడికి మద్దతుగా ప్రచారం చేస్తున్న భార్య మహాలక్ష్మి



తండ్రికి మద్దతుగా ప్రచారం చేస్తున్న కుమార్తె ప్రణీత



తండ్రి కోసం ఓటు అభ్యర్థిస్తున్న కుమార్తె అంజని

జగన్ సుపరిపాలనకు పట్టం కట్టాలి



రామకంచిరాజునగర్ కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కరప: గడచిన ఐదేళ్ల పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి, సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనకు మళ్లీ పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. సోమవారం వారు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను, గ్రామంలో చేసిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఇంటింటికీ వెళ్లి బ్యాలెట్ నమూనాతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబును, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కరప శివారు రామకంచిరాజు నగర్ కాలనీలో జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, పార్టీ నాయకులు పెంకే సత్తిబాబు, మేడిశెట్టి సత్తిబాబు, మద్దూరి భాస్కర్, చిన్నారి మురళీకృష్ణ, చింతా పల్లయ్య, నాగల బాలాజీ, తుమ్మలపల్లి చంద్రనగేష్, బైలపాటి నూకరాజు, గోన శ్రీను, గొర్రిపూడిలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ చీకాల అప్పలరాజు, పార్టీ నాయకులు చీకాల సుబ్బారావు, కె.శ్రీహరిబాబు, పెద్దాపురప్పాడులో మాజీ సర్పంచ్ గొల్లపల్లి ప్రసాదరావు, నల్లా బాలాజీ, పెదకొత్తూరులో గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా బుజ్జి, సర్పంచ్ చింతా నాగలక్ష్మి తదితరులు ప్రచారం నిర్వహించారు. వేళంగిలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ కుంచే అయ్యన్న, ఎంపీటీసీ ముషిని సూరిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు జీలకర్ర దుర్గారావు, నాయకులు సానా శ్రీను, జల్దాని రాంబాబు, కె.గుణ ప్రచారం చేశారు.

పురోహిత క్రికెట్ టోర్నీ విజేత కాకినాడ



టోర్నీ విజేత కాకినాడ జట్టుతో హరీష్

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఇంద్రపాలెం గ్రామానికి చెందిన దివంగత యల్లాజ్యోసుల శేషు ఎందరో యువ క్రీడాకారులను తయారు చేశారని క్రికెట్ సంఘ మాజీ అధ్యక్షుడు తలాటం హరీష్ అన్నారు. సోమవారం స్థానిక శశికాంత్ నగర్‌లోని క్రిక్స్ 8 నెట్స్‌లో యల్లాజ్యోసుల శేషు స్మారక బ్రాహ్మణ బాక్స్ క్రికెట్ రాష్ట్ర స్థాయి టోర్నీ ముగింపు జరిగింది. ఫైనల్స్‌లో కాకినాడ విజేత కాగా, హైదరాబాద్ రన్నర్స్‌గా నిలిచింది. బహుమతీ ప్రదానోత్సవంలో ముఖ్యఅతిథి తలాటం హరీష్ విజేతలకు కప్‌లను అందజేశారు. కార్యక్రమంలో నేమాని ఆస్ట్రాలజీ ప్రతినిధి రమేష్, వీరబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రెల్లి యూత్ జట్టుకు క్రికెట్ కిట్ అందజేత

హరీష చారిటబుల్ ట్రస్ట్ తరఫున రెల్లి యూత్ క్రికెట్ జట్టుకు రూ.15 వేల విలువైన క్రికెట్ కిట్‌ను సోమవారం అందజేసినట్టు హరీష్ తెలిపారు. యువత సన్మార్గంలో నడిపేందుకు ఏటా రాష్ట్ర స్థాయి రెల్లి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కాకినాడలోని హరీష్ స్పోర్ట్స్ వద్ద ఈ కిట్‌ను యూత్ సభ్యులకు అందజేశారు.

ఆకట్టుకుంటున్న ఆలిండియా హస్తకళా ప్రదర్శన



ప్రదర్శనలో వస్తువులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

బోట్‌క్లబ్: కళాకారుల కళాత్మక వస్తువులు కొనుగోలు చేసి చేనేత వస్త్రాలు, హస్త కళలను ప్రోత్సహించాలని ఎగ్జిబిషన్ మేనేజర్ ఖైజర్ అన్నారు. జేఎన్‌టీయూకే ఎదురుగా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆలిండియా హస్తకళాకారులు తయారుచేసిన వివిధ రకాల వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. శారీస్, కలంకారీ వస్త్రాలు, బ్యాంగిల్స్, కలంకారి డ్రెస్ మెటీరియల్స్, ఖాదీ షర్టులు, జైపురి బెడ్‌షీట్స్, పానిపట్ సోఫా కవర్స్, మైసూర్ పెయింటింగ్స్, టెరికోటా ఐటమ్స్, నాగాలాండ్ డ్రై ఫ్లవర్స్, ఒన్ గ్రామ్ గోల్డ్ జ్యూయలరీ, లేడీస్ డ్రెస్ మెటీరియల్స్, ఢిల్లీ రెడీమేడ్ గార్మెంట్స్, లేడీస్ చెప్పల్స్, బెంగాలి శారీస్, శహరన్‌పూర్ ఫర్నిచర్, లేడీస్ టాప్స్ , హైదరాబాద్ పెరల్స్, శారీస్, ఫిరోజాబాద్ గ్లాస్, గిఫ్ట్ ఐటమ్స్ లభిస్తాయన్నారు. ఉదయం 11 నుంచి రాత్రి 9 వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. సుమారు 30 వేల రకాల వస్తువులు ప్రదర్శనలో ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శన తిలకించేందుకు ఎటువంటి రుసుము లేదన్నారు.

కుమారుడికి మద్దతుగా తండ్రి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న సత్యనారాయణ

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబుకు మద్దతుగా ఆయన తండ్రి సత్యనారాయణ సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాకలపూడి గ్రామంలో పార్టీ నేతలు రాజ్‌కుమార్, సుబ్బారావు, సతీష్, నల్లా శ్రీను, ఇసుకపట్ల కుమారి, వి.విజయసారధి, కర్రి చక్రధర్ తదితరులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తన కుమారుడిని గెలిపించాలని అభ్యర్థించారు.

చీటింగ్ కేసు నమోదు

కాకినాడ రూరల్: కాకినాడ స్వామినగర్‌కు చెందిన ఇద్దరిపై ఇంద్రపాలెం పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. స్వామినగర్‌కు చెందిన తాపీమేస్త్రి కృష్ణార్జునరావు నాలుగేళ్ల క్రితం దుర్గాప్రసాద్‌రెడ్డికి సత్తిబాబు సమక్షంలో డబ్బు ఇచ్చానని, తిరిగివ్వకుండా మోసం చేశాడన్న ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై మణికుమార్ తెలిపారు. డబ్బు కోసం కృష్ణార్జునరావు చీమలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

కాకినాడ రూరల్‌లో రూ.3 వేల కోట్ల లబ్ధి

- వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- సర్పవరం భావనారాయణపురంలో ప్రచారం



సర్పవరం భవనారాయణపురంలో వృద్ధురాలికి ఓటు అభ్యర్థిస్తున్న కన్నబాబు



రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలతో ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ: కాకినాడ రూరల్ నియోజకవర్గంలో గత ఐదేళ్లలో సంక్షేమ పథకాలు కింద డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.మూడు వేల కోట్లు ప్రజలకు అందాయని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు అన్నారు. సర్పవరం భావనారాయణపురం గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ శీలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పుల్లా చందు, కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ డేవిడ్ లివింగ్‌స్టన్, రాజు, తదితరులు గజమాలతో స్వాగతం పలకగా, కన్నబాబు ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. వృద్ధుల వద్దకు వెళ్లి ఆయన ఆప్యాయంగా పలకరించారు. పింఛను సొమ్ము అందిందా అని అడగ్గా, ఇంకా అందలేదని బ్యాంక్‌లో వేశారని కన్నబాబుకు వివరించారు. వలంటీర్లు అందుబాటులో ఉంటే నెలనెలా పింఛన్లు సక్రమంగా అందేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛను రాజకీయాలపై కన్నబాబు వారికి వివరించారు. అనంతరం కన్నబాబు మాట్లాడుతూ సర్పవరం గ్రామంలో పెద్దఎత్తున అభివృద్ధి చేశామన్నారు. రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలతో పాటు, నాడు–నేడులో పాఠశాలల అభివృద్ధి, జల్‌జీవన్ మిషన్ ద్వారా వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం, సచివాలయ భవనాలు, విలేజ్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టామన్నారు. నియోజకవర్గంలో రూ.650 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

కాకినాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు సమక్షంలో రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాత్రి కరప మండలం పాతర్లగడ్డ నుంచి భారీగా పార్టీలో చేరారు. పార్టీ గ్రామ నాయకుడు మూరా అవినాష్ ఆధ్వర్యంలో శెట్టిబలిజ సంఘ నాయకులు గుత్తుల నాగేశ్వరరావు, చిన సత్యనారాయణ, చినశ్రీనివాసరావు, వెంకన్న(కొండబాబు), తాతాజీ(నాని), శివ, వెంకటరావు, వాసంశెట్టి సుబ్బారావు, సూరిబాబు, సూర్యనారాయణ, రాంబాబు, శ్రీనివాసు, కొండబాబు, పెంకే సీతారామయ్య, శేఖర్ తదితరులు 40 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. సూర్యారావుపేటకు చెందిన మత్స్యకారులు ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి సోమవారం చేరారు. బసవా ప్రసాద్ ఆధ్వర్యంలో మత్స్యకారులు దునే వినయ్, చోడిపల్లి మల్లేష్, గుర్రాల రాము, సలోమెన్, దునే ప్రసాద్, మణి తదితరులు చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి, కన్నబాబు సాదరంగా ఆహ్వానించారు. గంగనాపల్లిలో గీసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. జనసేన నాయకుడు ముమ్మిడి కృష్ణ, టీడీపీ నాయకులు సలాది సత్యనారాయణ(బెంజిబెన్), సలాది కృష్ణ, రమేష్ తదితరులు చేరారు.

పార్టీలో మత్స్యకారుల చేరిక



కన్నబాబు సమక్షంలో పార్టీలో చేరిన మత్స్యకారులు

కాకినాడ రూరల్: వాకలపూడి పంచాయతీలోని ఫిషింగ్ హార్బర్‌పేటకు చెందిన పలువురు మత్స్యకారులు ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు సమక్షంలో సోమవారం రాత్రి రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీలో చేరారు. హార్బర్‌పేటకు చెందిన పార్టీ నాయకుడు సంగాని ఇజ్రాయిల్(రాజు) ఆధ్వర్యంలో జనసేన యూత్ సభ్యుడు ఓలేటి శ్రీను, పెమ్మాడి ధర్మారావు, సంగాడి సుబ్బారావు, జాన్, పినపోతు రాజు, చోడిపల్లి శివ, కొండయ్య, చిన్ని, కొప్పనాతి ప్రవీణ్, సూరాడ బలరామ్, కామాడి మహేష్‌వర్మ, మెరుగు రాము, పినపోతు శ్రీను, ఓలేటి కుమార్, తేజ, పెమ్మాడి దుర్గామహేష్ తదితరులు సుమారు 200 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి కన్నబాబు సాదరంగా ఆహ్వానించారు.